సాక్షి విజయనగరం

గురువారం | 13 | ఏప్రిల్ | 2023



అతివకు ఆ'దారం'

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తమకు ప్రాధాన్యం కల్పిస్తూ అన్నిరంగాల్లో రాణించేలా ప్రోత్సహిస్తోందన్నారు. - 8లో



పరిశీలనా కోణం కీలకం

ఇంజినీరింగ్ విద్యార్థుల్లో పరిశీలనాత్మక ధోరణి కీలకమని విజయనగరం గురజాడ జేఎన్‌టీయూ వైస్ చాన్స్‌లర్ కె.వెంకటసుబ్బయ్య అన్నారు. - 8లో

ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం



వెలగపూడి శాసన సభ ప్రాంగణంలో ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం జరిగింది. రాష్ట్ర శాసన సభ అధ్యక్షుడు కొయ్యే మోషేనురాజు సమక్షంలో ఎమ్మెల్సీగా పీవీవీ సూర్యనారాయణరాజు ప్రమాణస్వీకారం చేశారు.

ఇఫ్తార్ | సహర్

గురు (సా॥) 6:18 | శుక్ర (ఉ॥) 4:18

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

కాలువ డిజైన్‌ను మార్చాలని వినతి



పోలవరం ఎడమ కాలువ ఎస్ఈకి వినతిపత్రం అందజేస్తున్న ఏపీ రైతు సంఘం ప్రతినిధులు

విజయనగరం అర్బన్: ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కాలువ డిజైన్‌ను మార్పుచేయాలని కోరుతూ పోలవరం ఎడమకాలువ ఎస్ఈ (రాజమండ్రి) ఏసుబాబుకు బుధవారం వినతిపత్రం అందజేశామని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, రైతులు ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాంతాలకు సాగునీరు అందేలా కాలువను నిర్మించాలని కోరామన్నారు. ఎస్ఈని కలిసిన వారిలో సుజల స్రవంతి పోరాట కమిటీ గౌరవాధ్యక్షుడు బి.గౌరినాయుడు, కన్వీనర్ చల్లా జగన్ తదితరులు ఉన్నారన్నారు.

వైద్యవిద్యలో విద్యార్థి ప్రతిభ

- పీజీ న్యూరో రేడియాలజీ విభాగంలో గోల్డ్‌మెడల్



యూనివర్సిటీ డీన్ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్, ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న వెంకటేష్

కొత్తవలస: మండలంలోని రామలింగాపురం గ్రామానికి చెందిన పోతుల వెంకటేష్ మెడిసిన్ న్యూరో రేడియాలజీ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించారు. ఆయన చెన్నైలోని ఎస్ఆర్ఎంసీ వర్సిటీలో పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. న్యూరోరేడియాలజీ విభాగంలో చూపిన ప్రతిభకు డాక్టర్ రాబర్ట్సుక్రో గోల్డ్‌మెడల్‌ను వర్సిటీ డీన్ ఆర్.వి.వికాంతచలం బుధవారం ప్రదానం చేశారు. విద్యార్థి వెంకటేష్‌ను రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబు, కొత్తవలస జెడ్పీటీసీ సభ్యురాలు నెక్కలి శ్రీదేవి అభినందించారు. ఆయన ప్రస్తుతం శ్రీకాకుళం జెమ్స్ వైద్య కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల జాతీయస్థాయిలో ఉత్తమ న్యూరో ఇంట్రవెన్షియల్ రేడియాలజిస్టుగా అవార్డు అందుకున్నారు.

5,738 మందికి ఈబీసీ నేస్తం

- రూ.8.6 కోట్ల చెక్కును అందజేసిన కలెక్టర్ నాగలక్ష్మి



ఈబీసీ నేస్తం లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: జిల్లాలోని ఆర్థికంగా వెనుకబడిన, అగ్రవర్ణాలకు చెందిన 45 మంది 60 సంవత్సరాల వయసుగల మహిళలకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రెండోవిడత ఈబీసీ నేస్తం నిధులను బుధవారం విడుదల చేసింది. ప్రకాశం జిల్లా మార్కాపురం నుంచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో బటన్‌నొక్కి లబ్ధిదారుల ఖాతాలకు నగదుజమచేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీనిని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్‌తో పాటు లబ్ధిదారులు తిలకించారు. అనంతరం జిల్లాలోని 5,738 మంది లబ్ధిదారులకు రూ.15 వేలు చొప్పున కేటాయించిన రూ.8.6 కోట్ల నమూనా చెక్కును లబ్ధిదారులకు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అందజేశారు. ప్రభుత్వ ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమాధికారి ఎం.యశోధనరావు, రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ రౌతు భాస్కరరెడ్డి, బీసీ యాత కార్పొరేషన్ డైరెక్టర్ గొంప అప్పలరాజు, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ అవనాపు లక్ష్మణరావు, బీసీ కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రగతి పథంలో... ఉత్తరాంధ్ర జిల్లాలు



బహిరంగ సభలో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వై.వి సుబ్బారెడ్డి

- టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి
- భోగాపురంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహణ



సభకు హాజరైన భోగాపురం పంచాయతీ ప్రజలు

భోగాపురం:

భోగాపురంలో అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంతో ఉత్తరాంధ్ర జిల్లాలు అభివృద్ధి చెందుతాయని, ఈ ప్రాంత ప్రజల కల సాకారం అవుతుందని టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. విమానాశ్రయ నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చేనెల 3వ తేదీన ముహూర్తం ఖరారు చేసిందని వెల్లడించారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆధ్వర్యంలో భోగాపురం మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పార్టీ శ్రేణులు, వలంటీర్లు, గృహ సారథులతో కలిసి ఇంటింటికీ వెళ్లి జగన్ పాలనపై ప్రజాభిప్రాయాలు సేకరించారు. అనంతరం లబ్ధిదారుల ఆమోదంతో ఇంటి గోడలకు 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను అతికించారు.

పంచాయతీ కార్యాలయం వద్ద పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వై.వి సుబ్బారెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సామాన్యులకు సంక్షేమ పథకాలు రావాలంటే జన్మభూమి కమిటీ సిపార్సులు అవసరమయ్యేవని, లంచాలు ఇస్తేనే పథకం లబ్ధి అందేదన్నారు. నేడు అర్హత కలిగిన ప్రతిఒక్కరి ఖాతాల్లో నేరుగా సంక్షేమ పథకాల ఆర్థిక లబ్ధి జమవుతోందని తెలిపారు. గతంలో మండలంలోని ప్రజలను టీడీపీ ప్రభుత్వం భయభ్రాంతులకు గురిచేస్తూ విమానాశ్రయ నిర్మాణానికి 15 వేల ఎకరాల భూములను సేకరించేందుకు నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి హామీతో అప్పట్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులు భూసేకరణను వ్యతిరేకిస్తూ భారీఎత్తున ఉద్యమాల చేశారని, దీంతో టీడీపీ ప్రభుత్వం దిగి వచ్చి భూసేకరణను 2700 ఎకరాలకు కుదించినట్టు వెల్లడించారు. ప్రజలను మభ్యపెడుతూ కేంద్రం నుంచి ఎటువంటి పర్యావరణ అనుమతులు పొందకుండా, తాగునీటి సౌకర్యం కల్పించకుండా హడావిడి చేస్తూ విమానాశ్రయ నిర్మాణానికి శంకుస్థాపన చేసిందన్నారు. ప్రస్తుతం సీఎం జగన్ ప్రభుత్వం కేంద్రం నుంచి పర్యావరణ అనుమతులను తీసుకుని, 500 ఎకరాలను మినహాయించుకుని మిగిలిన 2200 ఎకరాల్లో విమానాశ్రయాన్ని నిర్మించనుందని తెలిపారు. నిర్మాణానికి అవసరమైన తాగునీటి సరఫరాకు ప్రభుత్వం ఇప్పటికే రూ.90 కోట్లు నిధులు కేటాయించిందన్నారు. విపక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా 2024 ఎన్నికల్లో ప్రజలంతా ఏకమై బడ్డుకొండ అప్పలనాయుడును మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ మాట్లాడుతూ మండలంలో ఉన్న అక్కాచెల్లెమ్మలకు సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం రూ.26 కోట్లు అందజేసిందని చెప్పారు. విమానాశ్రయ నిర్మాణంతో పాటు విశాఖను పరిపాలన రాజధాని చేడడం వల్ల ఈ ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి కందుల రఘుబాబు, సీఈసీ సభ్యుడు కాకర్లపూడి శ్రీనివాసరాజు, నియోజకవర్గ పరిశీలకుడు ఎ.సూరిబాబు, మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీలు ఉప్పాడ అనూషరెడ్డి, అంబళ్ల సుధారాణి, బంటుపల్లి వాసుదేవరావు, జెడ్పీటీసీలు పడాల మంజులత, గదల సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీలు దంతులూరి రావాడబాబు, పడాల సత్యవతి, రాష్ట్ర హౌసింగ్, మత్స్య డైరెక్టర్లు ఉప్పాడ శివారెడ్డి, కె.సూర్యనారాయణ రాజు, నరసింహులు, మండల జేసీఎస్ కన్వీనర్ బైరెడ్డి యర్రప్పలనారాయణ, సీహెచ్ వెంకటరమణ, ఎ. శ్రీరాములునాయుడు, పి.అప్పలనాయుడు, పి.లక్ష్మినాయుడు, సర్పంచ్ ఊడికల అప్పయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి



- విద్య, వైద్యం, పారిశ్రామిక రంగాల ప్రగతికి ప్రత్యేక శ్రద్ధ
- విజయనగరం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

సాక్షి ప్రతినిధి, విజయనగరం: అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, ప్రజల సహకారంతో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తానని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. విజయనగరం జిల్లా కొత్త కలెక్టర్‌గా బుధవారం ఉదయం కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 'ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) సీఎండీగా పనిచేసినపుడు ఉత్తరాంధ్రపై కొంత అవగాహన ఉంది. విజయనగరం జిల్లా ప్రజలకు సేవ చేయడానికి శక్తివంచన లేకుండా పనిచేస్తాను. జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించడం అనంతపురం జిల్లా తర్వాత నాకు ఇది రెండో జిల్లా. ప్రజలకు ఎప్పుడైనా అందుబాటులో ఉంటాను. వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటాను. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ప్రజల సహకారం ఆశిస్తున్నాను' అని చెప్పారు. మహత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) ప్రాధాన్య జిల్లాగా విజయనగరం ఉందన్నారు. దాన్ని మరింత సద్వినియోగం చేయడంపై దృష్టిపెడతానని చెప్పారు. మానవాభివృద్ధి సూచిక ప్రకారం కీలకమైన విద్య, వైద్యంపై ఫోకస్ ఉంటుందన్నారు. జిల్లాను పారిశ్రామిక రంగంలోనూ ముందుకు తీసుకెళ్లడానికి, ప్రతిపాదనల్లో ఉన్న ప్రాజెక్టులను సాకారం చేయడానికి ఏపీఐఐసీ అధికారులతో చర్చిస్తానని కలెక్టర్ తెలిపారు.

వ్యక్తిగతం ఇలా...

పేరు	నాగలక్ష్మి సెల్వరాజన్
జన్మదినం	26.09.1989
స్వస్థలం	తమిళనాడు
ఉన్నత విద్య	బీఈ (ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్), బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్ పిలాని), 2006–10 బ్యాచ్
ఉద్యోగం	ఐఏఎస్ 2012 బ్యాచ్ (డైరెక్ట్ రిక్రూట్‌మెంట్)
భర్త	ఎం.నవీన్‌కుమార్ (2019 బ్యాచ్ ఐఏఎస్ అధికారి, శ్రీకాకుళం జాయింట్ కలెక్టర్)
వివాహం	తిరుపతిలో ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగింది

ఉద్యోగ బాధ్యతలు...

2013 జూన్ – 2014 సెప్టెంబర్	అనంతపురం జిల్లా అసిస్టెంట్ కలెక్టరు (శిక్షణ)
2014 సెప్టెంబర్ – 2015 డిసెంబర్	కృష్ణా జిల్లా సబ్‌కలెక్టరు (శిక్షణ)
2015 డిసెంబర్ – 2017 మే	గుంటూరు మున్సిపల్ కమిషనర్
2017 మే – 2019 జూలై	ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్
2019 జూలై – 2021 జూన్	ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ
2021 ఫిబ్రవరి – 2021 జూన్	విశాఖ నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్
2021 జూన్ – 2023 ఏప్రిల్	అనంతపురం జిల్లా కలెక్టర్

దుర్గమ్మకు పట్టుచీర సమర్పించిన బొత్స దంపతులు



ఆశీర్వచన మండపంలో మంత్రి బొత్స సత్యనారాయణతో ఈఓ భ్రమరాంబ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):

విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ కుటుంబ సమేతంగా బుధవారం దర్శించుకుని అమ్మవారికి పట్టుచీరను సమర్పించారు. దుర్గమ్మ దర్శనానికి కుటుంబ సమేతంగా విచ్చేసిన మంత్రి బొత్స సత్యనారాయణను ఆలయ ఈఓ భ్రమరాంబ, పాలక మండలి సభ్యులు బుద్దా రాంబాబులు సాదరంగా స్వాగతం పలికారు. అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలకగా, అమ్మవారిని దర్శించుకుని పట్టుచీర, పూజాసామగ్రి, పండ్లు సమర్పించి ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. అమ్మవారికి బొత్స దంపతులు పట్టుచీరను సమర్పించి రానున్న పౌర్ణమి నాడు అలంకరించాల్సిందిగా కోరారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఈఓ భ్రమరాంబ అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

మే 1న పైడితల్లి దేవర మహోత్సవం



దేవర మహోత్సవం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఈఓ, ట్రస్ట్ బోర్డు సభ్యులు

- ఉయ్యాలకంబాల ఉత్సవం వరకు చదురుగుడిలోనే అమ్మ దర్శనం
- దేవర ఉత్సవ వివరాలు వెల్లడించిన ఈఓ సుధారాణి

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి దేవర మహోత్సవం మే నెల 1వ తేదీన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని దేవదాయశాఖ సహాయ కమిషనర్, ఆలయ ఈఓ కె.ఎల్.సుధారాణి తెలిపారు. అమ్మవారి కల్యాణమండపం ఆవరణలో బుధవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పైడితల్లి అమ్మవారిని వనంగుడి నుంచి చదురుగుడికి తీసుకువచ్చే దేవర మహోత్సవాన్ని ఈ ఏడాది ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మే 1న రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడిలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించిన అనంతరం అమ్మవారి ఉత్సవవిగ్రహాన్ని గాడీఖానా, ఎన్‌సీఎస్ రోడ్డు, గంటస్తంభం మీదుగా హుకుంపేటలో ఉన్న అమ్మవారి చదురు వద్దకు తీసుకెళ్లి పూజలు చేస్తామన్నారు. రాత్రి 10 గంటల నుంచి అమ్మవారిని హుకుంపేట నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా మంగళవారం వేకువజామున మూడులాంతర్లు వద్ద నున్న చదురుగుడిలోకి తీసుకెళ్లి అమ్మను ఆశీనులు చేస్తామన్నారు.

అప్పటి నుంచి ఉయ్యాల కంబాల మహోత్సవం వరకు అమ్మవారు చదురుగుడిలోనే భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. ట్రస్టుబోర్డు సభ్యులతో కలిసి ఉత్సవ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఉత్సవానికి సంబంధించి ఆలయ తలయారీతో ఈ నెల 24న చాటింపు వేయిస్తామన్నారు. అనంతరం దేవరమహోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, ట్రస్టు బోర్డు సభ్యులు పతివాడ వెంకటరావు, ఎమ్‌కేబీ శ్రీనివాసరావు, బలివాడ పార్వతి, గంధం లావణ్య, డాక్టర్ సత్తి అచ్చిరెడ్డి, చిల్లా పుష్ప, ఆలయ సూపర్‌వైజర్ ఏడుకొండలు పాల్గొన్నారు.

హామీ ఇచ్చారు.. పోస్టింగ్‌లిచ్చారు

- డీఎస్సీ-98 క్వాలిఫైడ్ అభ్యర్థులకు ప్రారంభమైన కౌన్సెలింగ్
- ఉమ్మడి విజయనగరం జిల్లాలో 489 మందికి ఉద్యోగ అవకాశం
- కాంట్రాక్టు ఎస్‌జీటీలుగా ఏకోపాధ్యాయ స్కూళ్లకు కేటాయింపు
- హర్షం వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు



కౌన్సెలింగ్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం ఫూల్‌బాగ్: ఉద్యోగాల కోసం రెండు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న డీఎస్సీ-98 అభ్యర్థుల కల నెరవేరింది. విజయనగరం జిల్లా పరిషత్ కార్యాలయంలో కౌన్సెలింగ్ ప్రక్రియను జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసంకల్పయాత్రలో జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చారన్నారు. దీర్ఘకాలిక సమస్యకు పోస్టింగ్‌లతో పరిష్కారం చూపారన్నారు. నిరుద్యోగ అభ్యర్థుల్లో ఆనందం నింపారన్నారు. మాట ఇస్తే నెరవేర్చే నాయకుడు పాలకుడు కావడం మన అదృష్టంగా భావించాలన్నారు. చదువుతోనే పిల్లల భవిత మారుతుందని నమ్ముతూ విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. పాఠశాలల్లో చేరి పిల్లల భవిష్యత్‌కు గట్టిపునాది వేయాలని ఉద్యోగ అభ్యర్థులకు సూచించారు. కౌన్సెలింగ్‌కు విజయనగరం ఉమ్మడి జిల్లాలో 489 మందికి 474 మంది హాజరయ్యారు. 15 మంది గైర్హాజరయ్యారు. వీరికి గురువారం కౌన్సెలింగ్ నిర్వహిస్తామని విద్యాశాఖ అధికారులు తెలిపారు. జెడ్పీ కార్యాలయంలో నిర్వహించిన డీఎస్సీ-98 అభ్యర్థుల కౌన్సెలింగ్ సందడిగా సాగింది. పోస్టింగ్‌లు కేటాయించడంతో, ఇన్నాళ్లకు గురువు కల నెరవేరిందంటూ సంబరపడిపోయారు. జగనన్నే మా భవిష్యత్ అంటూ కొందరు నినదించారు.

ఫలించిన నిరీక్షణ



మాది సంతకవిటి మండలం మల్లయ్యపేట గ్రామం. ఎంఏ బీఈడీ పూర్తిచేశాను. డీఎస్సీ-98లో ఉద్యోగ అర్హత సాధించాను. కోర్టు కేసులతో ఉద్యోగం రాలేదు. భార్య సుశీలతో కలిసి కూలి పనులు చేసుకునేవాడిని. చివరకు బతుకుదెరువుకోసం పొందూరు వద్ద ఉన్న పెట్రోల్ బంక్‌లో బోయ్‌గా చేరాను. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో బుధవారం నిర్వహించిన ఉపాధ్యాయ కౌన్సెలింగ్‌లో పార్వతీపురం మన్యం జిల్లా కొటారికోట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా ఉద్యోగం వచ్చింది. మరో ఆరేళ్ల సర్వీసు ఉంది. కల నెరవేరింది.

– పొన్నాడ పాపారావు

25 ఏళ్ల కల నెరవేరింది



1998లో డీఎస్సీకి అర్హత సాధించినప్పటికీ చంద్రబాబునాయుడు ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వకుండా తాత్సారం చేసింది. ఉద్యోగం రాదనుకున్నాను. ముఖ్యమంత్రి జగన్‌మోన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగం ఇవ్వడం ఆనందంగా ఉంది. 25 ఏళ్ల కల ఫలించింది. రాజాం మున్సిపాల్టీ పరిధి డోలపేట ఎంపీపీ పాఠశాలలో పోస్టింగ్ లభించింది.

– పొట్నూరు గన్నిరాజు, పొనుగుటివలస

ఉద్యోగం వచ్చింది



చంద్రబాబు హయాంలో ఇదిగో అదిగో అంటూ మమ్మల్ని ఊరించారు. ఉద్యోగాలిస్తున్నాం అంటూ మమ్మల్ని ఎన్నికల సమయంలో వాడుకున్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు మాకు ఉద్యోగాలు వచ్చాయి. నాకు సాలూరు మండలం అన్నంరాజువలస పాఠశాలలో ఉద్యోగం వచ్చింది.

– బంకురు సత్యం, లక్ష్మీపురం, బాడంగి మండలం

న్యాయం చేశారు



ఆనాడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు మోసం చేస్తే.. ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాకు న్యాయం చేశారు. విజయగనరం జిల్లా గుర్ల మండలం లక్ష్మీనరసింహనగరం ఎంపీపీ స్కూల్‌లో పోస్టింగ్ ఇచ్చారు. 28 సంవత్సరాల కల నేటితో సాకారమైంది.

– అంబటి అప్పలరాజు, లక్కవరపుకోట గ్రామం

బతుకు మారుతుంది



ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చొరవతో మా కుటుంబ బతుకు చిత్రం మారనుంది. పూసపాటిరేగ మండలం బొర్రవానిపాలెం ప్రాథమిక పాఠశాలలో సెకండ్ గ్రేడ్ టీచర్‌గా ఉద్యోగం వచ్చింది. సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు.

– పోతల కృష్ణంనాయుడు, భర్తవానిపాలెం, వేపాడ మండలం


మరచిపోలేని మేలు



నా జీవితంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలు ఎన్నటికీ మర్చిపోలేను. సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో బీటెక్ పూర్తిచేసిన నా కుమారుడు శ్రావణ్‌కు సర్వేయర్‌గా ఉద్యోగం వచ్చింది. ఇప్పుడు నాకు ఉపాధ్యాయుడిగా అవకాశం లభించింది. మా కుటుంబమంతా సీఎంకు రుణపడి ఉంటాం.

– గుల్లిపల్లి రామకృష్ణనాయుడు, అంట్లవార, తెర్లాం మండలం


ఊహించని ఆనందం



నాకు ఉపాధ్యాయుడి పోస్టు వస్తుందని కలలో కూడా ఊహించలేదు. మా కలను జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారు. నాకు 14 సంవత్సరాల సర్వీస్ ఉంది. ప్రస్తుతం లక్కవరపుకోట మండలం జమ్మాదేవిపేట యూపీస్కూల్‌లో పోస్టింగ్ ఇచ్చారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.

– దాసరి రమేష్‌నాయుడు, లక్కవరపుకోట మండలం, సంతపేట గ్రామం

జగన్ అంటే నమ్మకం



జగన్ అంటే ఓ నమ్మకం. పేదల ఆర్థికోన్నతికి పాటుపడే నాయకుడు. ప్రజల కష్టాలు తెలుసుకుని పాలించే పాలకుడు. అందుకే మాట ఇస్తే ఎంత కష్టమైనా నెరవేర్చుతారు. నాలుగేళ్లుగా రాష్ట్రంలో తిండికి లోటులేకుండా పేదల బతుకుతున్నారంటే ఆయన పాలన చలువే. ఆయన చొరవతోనే ఉపాధ్యాయ ఉద్యోగం వచ్చింది.

– విసినిగిరి శంకరరావు, గర్భాం గ్రామం

జగనన్నే మా భవిష్యత్తు



జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కాకపోయి ఉంటే మా బతుకులు మారేవి కావు. దశాబ్దాల కల నెరవేర్చేవారే కరువయ్యేవారు. ఆయనకు వేసిన ఓటుకు మేలుచేకూర్చారు. జగనన్నే మా భవిష్యత్తు.

– బి.శ్రీనివాసరావు, గజపతినగరం

మాట నిలబెట్టుకున్నారు..



నేను కొండవలస గ్రామ సర్పంచ్‌గా పనిచేస్తున్నాను. జగన్‌మోహన్‌రెడ్డిని పాదయాత్రలో 1998 డీఎస్సీ బాధితుల సమస్యను వివరించాం. నాడే మాట ఇచ్చారు. నేడు నెరవేర్చారు. కొండవలస ఎంపీపీ స్కూల్‌లో పోస్టింగ్ వచ్చింది.

– తుమ్మి వెంకటరమణ

క్లుప్తంగా

అంగన్‌వాడీ కార్యకర్తకు మెమో జారీ చేయండి

● ఫుడ్ కమిషన్ మెంబర్ కాంతారావు



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కాంతారావు

విజయనగరం ఫోర్ట్: గుడ్లు సరఫరాలో తేడా ఉండడంతో అంగన్‌వాడీ కార్యకర్తకు మెమో జారీ చేయాలని సీడీపీఓ ప్రసన్నను రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ కాంతారావు ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక కణపాక అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అతర్వాత రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని పూర్తిస్థాయిలో అందించాలని తెలిపారు. గర్భిణులు, బాలింతలకు మధ్యాహ్న భోజనం పెట్టాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ మధుసూదన్‌రావు, సీఎస్‌డీటీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్‌టెక్నీషియన్, స్టాఫ్‌నర్స్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్‌లో ల్యాబ్‌టెక్నీషియన్, స్టాఫ్‌నర్సు, టెక్నికల్ సూపర్‌వైజర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి కె.సత్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

సకాలంలో మట్టి నమూనాలు సేకరించాలి

● జిల్లా వ్యవసాయ అధికారి తారకరామారావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి తారకరామారావు

విజయనగరం ఫోర్ట్: రైతుల పొలాల్లో సకాలంలో మట్టి నమూనాలు సేకరించాలని జిల్లా వ్యవసాయ అధికారి వి.తారాకరామారావు సూచించారు. ఈ మేరకు స్థానిక రైతు శిక్షణ కేంద్రంలో బుధవారం మట్టి నమూనాల సేకరణ, పరీక్షల విధానంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు తెలియజేయాలని చెప్పారు. ప్రతి రైతు భూసార పరీక్ష చేసుకునేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో భూసార పరీక్ష కేంద్రం ఎ.డి భానులత, ఎ.డి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో క్రమశిక్షణ ఎక్కడ?

● బూత్ కన్వీనర్ల సమావేశంలో పార్టీ నాయకుల ఆవేదన

బొండపల్లి: క్రమ శిక్షణ గలిగిన పార్టీ అని చెప్పుకునే తెలుగుదేశం పార్టీలో క్రమశిక్షణ ఎక్కడుందని గజపతినగరం నియోజకవర్గ స్థాయి బూత్ కన్వీనర్లు, క్లస్టర్ కన్వీనర్ల సమావేశంలో జిల్లా, రాష్ట్ర నాయకత్వం తీరుపై పలువురు పార్టీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. గజపతినగరం నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు అధ్యక్షతన బొండపల్లి మండల కేంద్రంలో బుధవారం జరిగిన పార్టీ సమావేశానికి నియోజకవర్గ పరిశీలకుడు, పార్టీ రాష్ట్ర నాయకుడు సివ్వల సూర్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆధ్వర్యంలో అందరూ ఏకపక్షంగా పార్టీ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశాలు ఉన్నప్పటికీ ఈ నియోజకవర్గంలో మరో నాయకుడు కరణం శివరామకృష్ణ వేరుగా కొంతకాలంగా కార్యక్రమాలు నిర్వహిస్తూ పార్టీ కేడర్‌ను అయోమయానికి గురి చేస్తున్నారని సమావేశంలో ఫిర్యాద చేశారు. దీనిపై చాలా సార్లు జిల్లా, రాష్ట్ర నాయకత్వానికి తెలియజేసినా ఫలితం లేకపోయిందని దీని వల్ల పార్టీకి తీవ్ర నష్టం తప్పదని స్పష్టం చేశారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150-00
బంగారం(22సి. 10గ్రా.)	51,800-00
వెండి (కిలో)	71,200-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹105	₹180	₹ 190

అతివకు ఆ'దారం'

● టైలరింగ్‌లో నైపుణ్య శిక్షణతో జీవనోపాధి
● విజయనగరం జిల్లాలో శిక్షణ కేంద్రాలు
● హర్షం వ్యక్తం చేస్తున్న మహిళలు



గజపతినగరంలో మహిళలకు దుస్తుల కటింగ్‌పై అవగాహన కల్పిస్తున్న శిక్షకులు



గజపతినగరం వెలుగు కార్యాలయం వద్ద కుట్టు శిక్షణపై తర్ఫీదు పొందుతున్న మహిళలు



జె.లక్ష్మునాయుడు, వెలుగు ఏరియా కోఆర్డినేటర్

గజపతినగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తమకు ప్రాధాన్యం కలిస్తూ అన్నిరంగాల్లో రాణించేలా ప్రోత్సహించి జీవనోపాధి కల్పిస్తుండడంతో ఆదాయం గిట్టుబాటవుతుందంటూ మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు జిల్లాలో విజయనగరం, గజపతినగరం, బొబ్బిలి, చీపురుపల్లి, నెల్లిమర్ల, ఎస్.కోట, రేగిడి తదితర 10కేంద్రాల్లో ఆరు నెలల పాటు రెండు విడతలుగా 30 మంది చొప్పున 600 మంది మహిళలకు స్వతహాగా వారి కాళ్లపై వారు నిలబడి జీవనోపాధి సాగించేలా అందజేసే వృత్తి విద్యాకోర్సుల్లో తర్ఫీదు పొందే మహిళలకు ఉచిత భోజన వసతి సదుపాయాలను కల్పిస్తూ ఇద్దరు మాస్టర్ ట్రైనర్‌ల ద్వారా శిక్షణ అందిస్తున్నారు. మహిళలకు శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన కత్తెర, స్కేలు, టేప్, మార్కింగ్ పెన్సిల్,పెన్ను,బ్యాగ్‌తో కూడిన కిట్లను ఉచితంగా అందిస్తున్నారు.అంతేకాకుండా చీరలు,జాకెట్ పీస్‌లు,వైట్ టాన్ తదితర మెటీరియల్‌ను కూడా తర్ఫీదు పొందిన వారికి ఇస్తున్నారు. వైఎస్సార్ క్రాంతి పథం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో జిల్లాలో మొత్తం 600మంది టైలరింగ్ శిక్షణ పొందుతున్నారు. ఇస్తున్నారు. భారత డైనమిక్ లిమిటెడ్ హైదరాబాద్ వారితో నిర్వహిస్తున్న ఈ శిక్షణ ఈ ఏడాది జనవరి నెలల ప్రారంభమైందని, జూన్ నెలలో పూర్తవుతుందని వెలుగు ఏరియా కార్డినేటర్ లక్ష్మునాయుడు తెలిపారు. వృత్తివిద్యా కోర్సు శిక్షణ పొందిన మహిళలంతా ఒకరిపై ఆధారపడకుండా ఆదాయం సంపాదించి జీవనం సాగిస్తూ మరికొంతమందికి ఉపాధి కల్పిస్తున్నారన్నారు. చిన్నపిల్లల నుంచి వృద్ధ మహిళల వరకు వినియోగించే పలు రకాల డిజైన్ దుస్తులు తయారీపై శిక్షణ ఇవ్వడంతో మహిళలు చక్కగా తర్ఫీదు పొందుతున్నారని తెలిపారు.

సొంతంగా ఇనిస్టిట్యూట్ ఏర్పాటుకు సిద్ధం



గజపతినగరం వెలుగు కేంద్రంలో ఉచితంగా అందిస్తున్న కుట్టుశిక్షణలో చేరాను.ఇక్కడ అన్నిరకాల కుట్లు నేర్పుతున్నారు. పూర్తిగా మూడునెలలు వర్క్ నేర్చారు. ఇప్పుడు గజపతినగరం మెంటాడ జంక్షన్ వద్ద సొంతంగా ఇనిస్టిట్యూట్ పెట్టేందుకు సిద్ధమవుతున్నాను. ఇదంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దయవల్లే జరిగింది. మామిడి సంధ్య (పీఎస్ఆర్ పురం)

రెండో బ్యాచ్‌కు శిక్షణ



శిక్షణకు వచ్చే ప్రతి మహిళకు మిషన్ ఆపరేటింగ్, జిగ్‌జాగ్, బాక్స్ కుట్టు, రౌండ్ సర్కిల్, తిన్నగా వేసే కుట్లపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాను.ఈశిక్షణ పొందిన వారు మంచి ఆదాయం పొందుతూ దేశంలో ఎక్కడైనా వారికాళ్ల మీద వారు నిలబడగలరు.ఇంతవరకు 30మంది మహిళలకు మొదటి విడతలో శిక్షణ ఇచ్చాను.రెండో బ్యాచ్‌కు శిక్షణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాను.

కె.గౌరి (నైపుణ్య కుట్టు శిక్షకురాలు)

కన్నీరొలికిన కళావతి

● సోదరుడికి అంతిమ వీడ్కోలు
● అంత్యక్రియల్లో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర



నివాళులర్పిస్తున్న ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర, ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్‌లు

వీరఘట్టం: వండవదొర కుటుంబంలో ఏకైక కుమారుడైన విశ్వాసరాయి లక్ష్మణరావు(63) మరణవార్త తనను ఎంతగానో కలిచివేసిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గిరిజన శాఖా మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి సోదరుడు మృతి చెందారనే విషయంతో తెలియడంతో ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర బుధవారం ఎమ్మెల్యే కళావతి స్వగ్రామం వండవ చేరుకుని మృతుడు లక్ష్మణరావుకు నివాళులర్పించారు. లక్ష్మణరావు పార్థివదేహంపై పూలమాల వేసి కన్నీటి పర్యంతమయ్యారు.వండవ దొర కుటుంబంతో తనుకున్న పరిచయాన్ని ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి రాజన్న దొర గుర్తు చేసుకుని అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆయనతో పాటు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కూడా అంత్యక్రియల్లో పాల్గొన్నారు. సోదరుడి మృతితో కుమిలిపోతున్న ఎమ్మెల్యే కళావతిని ఓదార్చారు. తన తండ్రి దివంగత మాజీ ఎం.పీ విశ్వాసరాయి నరసింహారావు(వండవదొర) తర్వాత అంతటి ఆప్యాయతను పంచిన అన్నయ్య లేరనే విషయాన్ని తట్టుకోలేక ఎమ్మెల్యే కళావతి కన్నీటి పర్యంతమయ్యారు. అన్నయ్యకు అంతిమ వీడ్కోలు పలుకుతూ అంజలి రథంతో సాగనంపారు.

తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ఎమ్మెల్యే కళావతి సోదరుడు మృతి చెందారనే వార్త తెలియడంతో జిల్లా నలుమూలల నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివచ్చి ఆయన అంత్యక్రియల్లో పాల్గొని నివాళులర్పించారు. అలాగే పాలకొండ నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలువురు అధికారులు వండవదొర కుటుంబ సభ్యులకు తమ సంతాపం తెలిపారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

● హాజరైన 283 మంది అభ్యర్థులు
● జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

పార్వతీపురం టౌన్: నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణంలో నిర్వహించిన అరబిందో ఫార్మా కంపెనీ జాబ్ డ్రైవ్‌కు విశేష స్పందన లభించిందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 283 మంది ఇంటర్వ్యూలకు హాజరుకాగా అందులో 171 మందిని అరబిందో ఫార్మా కంపెనీలో ఎంపిక చేశామన్నారు. 26 మంది తుది రౌండ్ కోసం ఎంపికయ్యారని తెలిపారు. శ్రీ వేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ సీహెచ్ చలపతి రావు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం ఇది ఐదో సారని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని, ఇలాంటి అవకాశాలను నిరుద్యోగ యువత అందిపుచ్చుకుని ఉన్నతా శిఖరాలు అధిరోహించాలని కోరారు.

ఆక్రమణల తొలగింపులో ఉద్రిక్తం

● భవనంపై నుంచి దూకేసిన దుకాణ నిర్వాహకుడు



భవనంపై నుంచి దూకిన రమణ



కాలువపై ఉన్న ఆక్రమిత దుకాణం జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం

విజయనగరం: నగరంలోని ఐస్‌ఫ్యాక్టరీ జంక్షన్ ప్రాంతంలో చేపట్టిన ఆక్రమణల తొలగింపులో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా జంక్షన్‌లోని ఆక్రమణలు తొలగించేందుకు కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ అధికారులు బుధవారం చర్యలు చేపట్టారు. అందులో భాగంగా అయోధ్యామైదానం రోడ్డు నుంచి పువ్వాడ స్కూలుకు వెళ్లే ఎడమ వైపు మార్గంలో కార్పొరేషన్ కాలువను ఆక్రమించి నిర్వహిస్తున్న చిన్నపాటి దుకాణాన్ని జేసీబీతో తొలగించేందుకు ఉపక్రమించారు. దీంతో దుకాణ నిర్వాహకుడు రమణ అడ్డుకునేందుకు ప్రయత్నించి భవనంపైకి ఎక్కి హడావుడి చేశాడు. తన దుకాణం తొలగిస్తే విద్యుత్ వైర్లు పట్టుకుని ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. దీంతో అక్కడే ఉన్న పోలీసులు, కార్పొరేషన్ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.

అదే సందర్భంలో ఆందోళనకారుడు రమణ భవనంపై నుంచి రోడ్డుపైకి దూకడంతో ఉద్రిక్తతకు దారితీసింది. తక్షణమే స్పందించిన టూటౌన్ సీఐ సీహెచ్ లక్ష్మణరావు హుటాహుటిన జిల్లా కేంద్రాస్పత్రికి బాధితుడు రమణను తరలించారు. ఇదిలా ఉండగా నిబంధనల మేరకు ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టామని, గతంలో పలు మార్లు మౌఖికంగా చెప్పామని సిటీ అసిస్టెంట్ ప్లానర్ మధుసూదనరావు తెలిపారు. కాలువలను ఆక్రమించి దుకాణాలు నిర్వహించడంతో మురుగునీటి ప్రవాహానికి అడ్డంకిగా మారుతుందన్నారు. నగరంలో ఆక్రమణలపై ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

25 కిలోల గంజాయి స్వాధీనం

శృంగవరపుకోట: పట్టణంలోని విశాఖ–అరకు రోడ్డులో మంగళవారం సాయంత్రం గంజాయి పట్టుబడింది. ఎస్.కోట ఆర్టీసీ కాంప్లెక్స్ బయట ఎవరో వదిలిపెట్టిన రెండు బ్యాగులను పోలీసులు గుర్తించారు. వాటిని పరిశీలించగా 25కిలోల గంజాయి బయటపడింది. దీంతో గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌కోట ఎస్సై తారకేశ్వరరావు చెప్పారు.

ఒలింపియాడ్‌లో విద్యార్థుల సత్తా



ఒలింపియాడ్‌లో సత్తా చాటిన విద్యార్థులతో జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు

శృంగవరపుకోట: మండలంలోని వెంకటరమణపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన జాతీయస్థాయి సైన్స్, మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో చక్కని ప్రతిభ కనబరిచారని హెచ్‌ఎం వి.ఎరుకునాయుడు చెప్పారు. పాఠశాలకు చెందిన గుదె పద్మసాయి, యండపల్లి ధనుశ్రీ, కేదారి బంగారులక్ష్మి, వర్జి సంధ్య, పిల్లా నాగేంద్ర, పల్లి మోహన్, దువ్వాడ మౌనికలు ప్రాథమిక స్థాయిలో సత్తా చాటి, రెండవ స్థాయికి అర్హత సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో విద్యార్థులతో పాటు సైన్స్, మ్యాథ్స్ ఒలింపియాడ్ ఇన్‌చార్జ్‌లు సుధాప్రసాదరావు, కె.నూకరత్నంలను పాఠశాల ఉపాధ్యాయులు, హెచ్‌ఎం ఎరుకునాయుడు అభినందించారు.

పరిశీలనా కోణం కీలకం

● విజయనగరం గురజాడ జేఎన్‌టీయూ వీసీ వెంకటసుబ్బయ్య



కార్యక్రమంలో మాట్లాడుతున్న గురజాడ జేఎన్‌టీయూ వీసీ వెంకటసుబ్బయ్య



హాజరైన విద్యార్థులు

డెంకాడ: ఇంజినీరింగ్ విద్యార్థుల్లో పరిశీలనాత్మక ధోరణి కీలకమని విజయనగరం గురజాడ జేఎన్‌టీయూ వైస్ చాన్స్‌లర్ కె.వెంకటసుబ్బయ్య అన్నారు. ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో డిజిటల్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ప్రోత్సహిస్తూ డిజిటల్ డిటాక్స్ సెమినార్‌ను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ జి20 ప్రెసిడెన్సీ, వై20 లక్ష్యాలను వివరించారు. యువత వారి ఆలోచనలు, అనుభవాలను పంచుకోవడానికి, తోటి వారి ఆరోగ్యం, శ్రేయస్సుకు తోడ్పడే విధానాలు, కార్యక్రమాల కోసం ఆరోగ్యకరమైన వాదనలు, చర్చలు వై20 వేదిక కల్పిస్తుందన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రపంచ సమస్యలు, ఆలోచనల మార్పిడి, వాదించడం, చర్చలు జరపడం, అవగాహన కల్పించుకుని ఏకాభిప్రాయానికి చేరుకోవడంపై చురుగ్గా పాల్గొనాలని సూచించారు. వ్యూహాత్మక సలహాదారు, మనస్తత్వవేత్త రాజ్‌యోగి కె.రామకృష్ణ మాట్లాడుతూ కోవిడ్–19 ప్రజల మానసిక, శారీరక ఆరోగ్యంపై ఎంతటి చెడు ప్రభావాన్ని చూపిందన్నది వివరించారు. కార్యక్రమంలో రాజ్‌యోగిని బీకే అన్నపూర్ణ రోజు వారి జీవితంలో ధ్యానం, యోగా ప్రాముఖ్యాన్ని వివరించారు. కార్యక్రమంలో రామగోపాల్, వైస్‌ప్రిన్సిపాల్ వైఎంసీ శేఖర్, ఎన్ఎస్ఎస్ పీఓ ఎస్.షణ్ముఖరావు, వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

భీమాలి తాండ్రకు జీఐ.టాగ్ అవసరం

● గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీకట్టిమణి



మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి

విజయనగరం అర్బన్: జిల్లాలోని భీమాలి మామిడి తాండ్రకు జియోగ్రఫీ ఇండికేషన్ (జీఐ) టాగ్ తీసుకొస్తే మంచి లాభాలను ఆర్జించవచ్చని కేంద్రియ గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి అన్నారు. 'ప్రాస్పెక్టస్ అండ్ ప్రాబ్లమ్స్ ఆఫ్ మేంగో జెల్లీ బిజినెస్' అనే అంశంపై స్థానిక యూనివర్సిటీ ప్రాంగణంలో బుధవారం జరిగిన ఒక రోజు సదస్సులో ఆయన ముఖ్య వక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్‌కోట మండలం భీమాలి గ్రామం మామిడి తాండ్రకు ప్రసిద్ధి కానీ ఆశించిన స్థాయిలో గుర్తింపు రాలేదన్నారు. ఇక్కడి తాండ్ర వ్యాపారానికి అవసరమైన వ్యాపార మెలకువలు, బ్రాండింగ్, నాణ్యత, స్టోరేజ్ సౌకర్యం పెంచితే భీమాలి తాండ్రకు జీఐ ట్యాగ్ తీసుకురావచ్చన్నారు. తాండ్ర వ్యాపార అభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలపై యూనివర్సిటీ విద్యార్థుల ద్వారా సహాయ సహకారాలను అందిస్తామని చెప్పారు. యూనివర్సిటీ విద్యార్థులకు భీమాలి తాండ్ర తయారీ, అమ్మకం ప్రాజెక్ట వర్క్‌గా కూడా ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్‌డీఏ ఏపీపీ సావిత్రి, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ జయశ్రీ, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ కళింగ వర్ధన్, అంబికా స్వీట్స్ సీఈఓ శ్రీనివాస్, భీమాలి సర్పంచ్ కృష్ణ తదితరులు మామిడి తాండ్ర తయారీకి సంబంధించిన సమస్యలు, వ్యాపారానికి సంబంధించిన వివిధ సూచనలు సలహాలను అందించారు. అనంతరం సీటీయూ మేనేజ్‌మెంట్ విద్యార్థులు భీమాలి మామిడి రైతులతో వివిధ అంశాలపై చర్చించారు. సదస్సుకు కన్వీనర్‌గా ప్రొఫెసర్ జితేంద్రమోహన్ మిశ్రా, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డాక్టర్ ఎస్‌వీఎస్ సూర్యనారాయణ వ్యవహరించారు. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎఫ్ఎంఎస్ రద్దు చేయాలి

● ఏపీజేఏసీ రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు



నిరసన శిబిరం ఎదుట మాట్లాడుతున్న ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

విజయనగరం అర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయ జీతభత్యాలకు సంబంధించిన సీఎఫ్ఎంఎస్ విధానాన్ని రద్దు చేయాలని ఏపీజేఏసీ రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఏపీజేఏసీ అమరావతి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ ఎదుట బుధవారం జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగుల జీతభత్యాల లెక్కలు ప్రభుత్వం చెప్పలేకపోవడం అవమానకరమని, డీఏ, సీపీఎస్, పీఆర్‌సీ, ప్రాథమిక హక్కులు ఇలా ప్రతి అంశంలో ప్రభుత్వం విఫలమవడం చరిత్రలో ఎప్పుడూ చూడలేదని అన్నారు. ఉద్యోగులు రోడ్లపైకి వచ్చి పోరాడితేనే ఫలితం కనిపిస్తుందని అభిప్రాయ పడ్డారు. హక్కుల కోసం ప్రతి ఉద్యోగి ఉద్యమంలో భాగం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ట్రెజరీ శాఖ రాష్ట్ర కార్యదర్శి పద్మనాభం, రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు తాడ్డి గోవింద్, ఏపీజేఏసీ అమరావతి జిల్లా ప్రతినిధులు కేవీరమణరాజు, అధ్యక్షుడు ఎ.వి జయకుమార్, ఆర్టీసీ సంఘాల ప్రతినిధులు పి.భానుమూర్తి, సత్యనారాయణ, వివిధ శాఖల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

రాజాం సిటీ: స్థానిక మేదరవీధి చిన్నచెరువు గట్టుకు చెందిన బాలుడు ఎస్.అనీఫ్(4) బుధవారం సాయంత్రం ఆడుకునేందుకు వీధిలోకి వచ్చి తప్పిపోయాడు. అలా నడుచుకుంటూ మెయిన్ రోడ్డులోని ఎస్‌బీఐ వద్దకు చేరుకుని బిత్తర చూపులు చూస్తుండడంతో గమనించిన బ్యాంకు సిబ్బంది ఆ బాలుడిని అంబేడ్కర్ జంక్షన్‌లో విధి నిర్వహణలో ఉన్న ఎస్సై నీలావతికి అప్పగించారు. ఈ క్రమంలో బాలుడి తండ్రి రఫీతోపాటు కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతూ తలో దిక్కు వెతుకులాడుతూ మెయిన్ రోడ్డువైపు వచ్చారు. అక్కడ పోలీసుల వద్ద తమ కుమారుడు ఉండడాన్ని గమనించి వెళ్లారు. దీంతో ఎస్సై నీలావతి వారి వద్ద వివరాలు తెలుసుకుని నిర్ధారించి బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు.



తల్లిదండ్రులకు అప్పగించిన బాలుడితో ఎస్సై నీలావతి, సిబ్బంది

అనుబంధ రంగాలతో ఆదాయం



గిరిజన రైతులకు జీవాలు ఇస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు, శాస్త్రవేత్తలు

శృంగవరపుకోట: వ్యవసాయ అనుబంధ రంగాలపై దృష్టి సారించడం వల్ల అదనపు ఆదాయం సాధించుకోవచ్చని ఎమ్మెల్సీ రఘురాజు అన్నారు. ఈ మేరకు బుధవారం మధ్యాహ్నం మండలంలోని బొడ్డవర రైతు భరోసా కేంద్రం పరిధిలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఐసీఎఆర్–ఎస్‌బీఐఏఆర్‌ల సమన్వయంతో విజయనగరం ఏరువాక కేంద్రం పరిధిలో 200 గిరిజన కుటుంబాలతో గిరిజన ఉప ప్రణాళిక శిక్షణ కార్యక్రమం నిర్వహిలచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ పాడి, లేగదూడలు, కోళ్లు, జీవాల పెంపకం వంటి అనుబంధ రంగాలపై అవగాహన, పంటల్లో జీవనియంత్రణ, సేంద్రియ సాగు, విలువ ఆధారిత ఉత్పత్తులు పండించే మార్గాలు తెలుసుకుని అనుసరించాలని సూచించారు. డాక్టర్ ఎస్ఎస్ సునీల్, డాక్టర్ కె.శ్రీదేవిలు వివిధ పంటల్లో జీవ నియంత్రణ గురించి శిక్షణలో వివరించారు. అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం సంచాలకుడు డాక్టర్ పీవీకే జగన్నాథరావు, విలువ ఆధారిత ఉత్పత్తులు గ్రామస్థాయిలో వ్యయసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్‌ను తెలియజేశారు. విజయనగరం వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.అనూరాధ, డాక్టర్ ఎంఎంవి.శ్రీనివాసరావులు చిరుధాన్యాలు, సమగ్ర వ్యవసాయ విధానం గురించి క్షుణ్ణంగా వివరించారు. ఏరువాక కేంద్రం సమన్వయ కర్త డాక్టర్ కె.లక్ష్మణ్ భాగస్వామ్య రైతాంగానికి మేకలు, వనశ్రీ కోళ్లు, డూప్లెక్స్ కోళ్ల గూళ్లు, జీడిమామిడి అంట్లు, కూరగాయల విత్తనాలు, అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ తేజేశ్వరరావు, వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకుడు రామారావు, సహాయ సంచాలకురాలు ఎల్.విజయ, మండల వ్యవసాయ అధికారి రవీంద్ర, గ్రామసర్పంచ్ మీనా, ఎంటీసీ లక్ష్మి, మురళీరాజు, కేత వీరన్నలతో పాటు అగ్రికల్చర్ అసిస్టెంట్లు, పలువురు గిరిజన రైతులు పాల్గొన్నారు.